క్లుప్తంగా

200 ఎకరాలలో టమాటా సాగు


దాలివలసలో సాగులో ఉన్న టమాటా పంట

కె.కోటపాడు : మండలంలో టమాటా పంట సాగును రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. రెండు నెలల కాల వ్యవధి లోనే దిగుబడి వచ్చే టమాట పంటను మండలంలో కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, దాలివలస, మర్రివలస, పాతవలస గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మెట్టప్రాంత గ్రామాల్లో సాగులో ఉన్న టమాటా పంటకు ఇటీవల కురిసిన వర్షాలు మేలు చేశాయని సాగు రైతులు తెలుపుతున్నారు. మార్కెట్‌లో టమాటాకు ప్రస్తుతం మంచి గిట్టుబాటు ధర ఉండడంతో సాగు లాభదాయకంగా ఉంటుందని చెబుతున్నారు.

భవానీమాత కలశజ్యోతి ఊరేగింపు


ఎం.కోడూరులో భవానీ కలశజ్యోతి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో భవానీమాత అమ్మవారి కలశజ్యోతి ఊరేగింపు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని భవానీ భక్తులు, గ్రామస్తుల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఊరేగింపు రథానికి స్వాగతం పలుకుతూ గ్రామస్తులు రోడ్లన్నీ పసుపు నీళ్లతో కడిగి శుభ్రం చేశారు. అనంతరం మహిళలు, చిన్నారులు జ్యోతులు పట్టుకుని ముందుకు నడిచారు. అమ్మవారి రథాన్ని భవానీ భక్తులు వెంట రాగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహ కార్యక్రమం


వీరవల్లిలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమం

మాడుగుల రూరల్ : మండలంలో వీరవల్లి అగ్రహారం శ్రీ దత్తపీఠంలో నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ నెల 8 వ తేది నుంచి పీఠంలో సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. ఆదివారం పీఠం వద్ద హోమం, అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తపీఠాధిపతి డి.శ్రీనివాస భరణిశర్మ, దత్త భక్తులు పాల్గొన్నారు.

తప్పిన తుపాను గండంతో జోరుగా వరి కోతలు


బుచ్చెయ్యపేట పొలాల్లో వరి కోతలు, కుప్పలు పెడుతున్న రైతులు

బుచ్చెయ్యపేట : మండలంలో అన్ని గ్రామాల్లో జోరుగా వరి కోతలు జరుగుతున్నాయి. వారం పది రోజులుగా తుపాన్ వాయుగుండం ప్రభావంతో ఆకాశం కారుమబ్బులతో ఉండడంతో రైతులు వరి కోతలు నిలిపివేశారు. రెండు రోజులుగా ఎండ కాయడంతో బుచ్చెయ్యపేట, దిబ్బిడి, రాజాం, లోపూడి, లూలూరు, శింగవరం, పీడీ పాలెం, గున్నెంపూడి, పెదమదీన తదితర గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. పలువురు రైతులు వరి కోతలు కోసి కుప్పలు పెట్టడంలో నిమగ్నమయ్యారు.

వెండి శఠగోపం బహూకరణ

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామ ఇలవేల్పు మోదమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి 30 తులాల వెండి శఠగోపం ఆదివారం సమర్పించారు. విశ్రాంత పోలీసు ఎస్ఐ పోతిన వెంకటరమణ త్రివేణి దంపతులు, వారి కుమార్తెలు జానకీ, వెంకటలక్ష్మి ప్రసన్న లౌక్య ఆర్థిక సహకారంతో 30 తులాల విలువైన శఠగోపంను ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవి రావుకు అందజేశారు.

పాలిథిన్ సంచి... కాలుష్యం పెంచె!



పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. వీటి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. దీనిని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నారు. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

- విరివిగా వాడకం...నియంత్రణ పూజ్యం
- విచ్చలవిడిగా వ్యాపారుల విక్రయాలు
- దెబ్బతింటున్న పర్యావరణం
- పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం : ఏ ప్రాంతంలో చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగం కొనసాగుతూనే ఉంది. కిరాణా దుకాణాల్లో వీటి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, చిన్న, చిన్న దుకాణాలపాటు సంతల్లో నిత్యం వీటి వాడకం పరిపాటిగా మారింది. ఈ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించిన అనంతరం ఎక్కడ బడితే అక్కడ పారేయడంతో అవి భూమిలో కలవకుండా పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

అమలుకాని నిబంధనలు..

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్‌తో గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలసిపోయినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినా వాటిని ఎవరూ వినియోగించడంలేదు. వీటి ధర ఎక్కువగా ఉందని, తక్కువ ధరకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వినియోగదారులు కూడా వీటితోనే సరుకులు తీసుకెళుతున్నారు.


చెత్త కుప్పల్లో అధికంగా కనిపిస్తున్న పాలిథిన్ కవర్లు

ప్రకటనలకే పరిమితం..

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశాం.. వాటిని విక్రయిస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమిత మవుతున్నాయి. వీటిని విక్రయించే వారిపై అధికారులు తీసుకున్న చర్యలు ఎక్కడా కనిపించలేదు. ఈ నేపథ్యంలో నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. గ్రామాల్లో ఎక్కడ చెత్త కుప్పల్లో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

అవగాహన కల్పించాలి



ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వీటివల్ల కలిగే అనర్థాలపై అతి తక్కువ మందికే తెలియడంతో వినియోగం తగ్గడం లేదు. తక్కువ ధరకు పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు వస్తుండడంతో వీటి వల్ల కలిగే నష్టాన్ని గుర్తించడం లేదు.

– బి.వరహాలదొర, వినియోగదారుల సంఘ అధ్యక్షుడు, మాకవరపాలెం

నిబంధనలు అమలు చేయాలి



ప్లాస్టిక్ నివారణకు తీసుకువచ్చిన నిబంధనలు అమలు చేయాలి. పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే వీటి వినియోగం పెరిగి పర్యావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడతారు.

– పిల్లా బాబూరావు, జీ.కోడూరు

మూడు సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

మాడుగుల రూరల్ : మండలంలో 14 చిన్నతరహా నీటి సంఘాలకు గాను రెండు నీటి సంఘాలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎం.కోడూరు తాచేరు నీటి సంఘం, ఎం.కృష్ణాపురంలో నీటి సంఘం ఎన్నిక వాయిదా పడినట్టు మండల ఇరిగేషన్ జేఈ భార్గవ్‌కుమార్ ఆదివారం తెలిపారు. అలాగే 8 మధ్య తరహా నీటి సంఘాలకు సంబంధించి, కోనాం జలాశయం శిరిజాం నీటి సంఘం -2 సంఘం(కె..జె.పురం) ఎన్నిక వాయిదా పడిందన్నారు.

సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీరే...

మాడుగుల పాలగెడ్డ నీటి సంఘం అధ్యక్షులుగా బొడ్డేడ అప్పలనర్సమ్మ, ఉపాధ్యక్షులుగా పాతరపల్లి అప్పారావు, వి.వి.అగ్రహారం ఎరుకువాడ నీటి సంఘం అధ్యక్షులుగా పాచిల రమణ, ఉపాధ్యక్షులుగా గంగునాయుడు, కె.జె.పురం గురువుల కాలువ సంఘం అధ్యక్షులుగా కోయిలాడ సన్యాసిరావు, ఉపాధ్యక్షులుగా భీశెట్టి సూరిబాబు, పెదసేరి నీటి సంఘం అధ్యక్షులుగా మళ్ల జగ్గారావు, యల్లపు బలరామస్వామి, ఎర్రమ్మాదేవి ఛానల్ నీటి సంఘంనకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఆడారి వీర వెంకట ఆదినారాయణ (బాబ్జి) తనకాల శ్రీను, చింతలూరు లోవచెరువు సంఘాన్నికి కాళింగ ఈశ్వరావు, కాళింగ శ్రీరామూర్తి, గాదిరాయి ఆనకట్ట గొర్రిగెడ్డ ఛానల్‌కు (చింతలూరు) కాళింగ అప్పలనాయుడు, పెంటకోట సంజీవ్, లును అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. మిగిలిన సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు వివరాలు తెలియాల్సి ఉంది.

తెగిన విద్యుత్ వైర్లు... తప్పిన ప్రమాదం

రోలుగుంట : మండల కేంద్రం 33/11 కె.వి నుంచి రోలుగుంట–కొవ్వూరు రూట్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్న 11 కె.వి.విద్యుత్ లైన్ ద్వారా విద్యుత్తు సరఫరా జరుగుతుంది. ఆదివారం వేకువ జామున కొవ్వూరు దాటిన తరువాత సెల్ టవర్ సమీపంలో రోడ్డు పక్కనున్న తాడిచెట్టు 11 కేవీ వైరుపై పడి మంటలు రేగాయి. ఈ ఘటనలో వైర్లు తెగి కింద పడిపోయాయి. ఆ సమయంలో పొలాలకు వెళ్లే రైతులు వెంటనే లైన్‌మన్ రాజేష్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఆయన జేఈ దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ సరఫరాను నిలుపదల చేసి తెగిపడిన వైర్లను బిగించి మళ్లీ లైను పునరుద్ధరించారు. వైర్లు తెగిన సమయంలో ఈ రూట్‌ల్లో ఏ విధమైన రాకపోకలు లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సందర్భంగా జేఈ రాజేష్ ఇటువంటి ప్రమాద సంఘటనలను దృష్టిలో ఉంచుకొని స్థానిక రైతులు విద్యుత్‌లైనుకు అంతరాయంగా ఉన్న వృక్షాలను స్వచ్ఛందంగా తొలగించి విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



రోలుగుంట-కొవ్వూరు రూట్‌లో తెగిన 11 కేవీ విద్యుత్ వైర్లు, కాలిపోయిన తాడిచెట్టు

అమరపురిలో ఘనంగా బాబా జయంతి వేడుకలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల కొమ్మల్లపూడి శివారు అమరపురి జ్యోతిర్మయ బాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అమరపురిలో భక్తులు బాబా 99వ జయంతి వేడుకలు సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ఆయన దివ్య సమాధి వద్ద శ్రద్ధంజలి కట్టించారు. పలువురు పేదలు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయగా పలు గ్రామాలకు చెందిన ఆయన భక్తులు పాల్గొన్నారు. పలువురు నాయకులు బాబా పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.

ఎంపీపీ కుమార్తె వివాహ వేడుకల్లో బొత్స, బూడి


వివాహ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర విధాన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, ధర్మశ్రీ


వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ కుమార్తె ఇందిర వివాహ వేడుకల్లో రాష్ట్ర విధాన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలు రావికమతం మండలం కొమిర గ్రామంలో శనివారం రాత్రి జరిగాయి. ఈ వేడుకలలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడుతో పాటు చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ జిల్లా, మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు


పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నర్సీపట్నం: పొట్టి శ్రీరాములు వర్ధంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బేతిరెడ్డి రత్నం, మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నాయకులు బేతిరెడ్డి విజయ్‌కుమార్, అప్పలనాయుడు, తమరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి పూలమాల వేసి నివాళులర్పించారు. వాసవీ కళ్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవీ కళ్యాణ మండపం సంఘం ప్రతినిధులు వెలగా నారాయణ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

చీడికాడ : అందరికీ ఆదర్శవంతునిగా అమరజీవి పొట్టి శ్రీరాములు నిలిచారని లైబ్రేరియన్ జోగేశ్వరి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన రోజు సందర్భంగా చీడికాడ శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

- నేడు మోగనున్న నెలగంట
- నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు
- మేలు కొలుపు పాటలు, సంకీర్తనలతో గ్రామాల్లో సందడి

బుచ్చెయ్యపేట : ధనుర్మాస నెల రోజుల పూజలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 16వ తేదీ ఉదయం 7 గంటలకు నెల గంట పెట్టినప్పటి నుంచి ధనుర్మాసం ప్రారంభం అవుతుంది. నెల రోజుల పాటు గ్రామాల్లో మేలు కొలుపు భక్తిపాటలు, సంకీర్తనలు, ప్రత్యేక భజనలు, హరినామస్మరణతో మారు మోగనున్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుండే ప్రతి గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలతో పాటు తమ ఇళ్ల ముందు రంగురంగు సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. రామాలయాలతో పాటు అన్ని దేవాలయాల్లో నారాయణ్ణి స్మరిస్తూ అన్ని గ్రామాల్లో సంకీర్తనలు, భక్తి భజనలతో ఆధ్యాత్మిక శోభ కనిపిస్తుంది. భక్తులు తెల్లవారుజామునే తలంటి స్నానాలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తమ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో తిరుగుతూ హరినారాయణున్ని స్మరిస్తూ మేలుకొలుపులు చేస్తారు. ధనుర్మాసంలో సూర్యుడు ఉదయించక ముందే లేచి ప్రత్యేక పూజలు చేస్తే దోషాలు పోయి అంతా శుభం జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తారు.

మాడుగుల : స్థానిక అతి పురాతన సార్థసారథి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయని, ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవాచార్యులు తెలిపారు. 16 వ తేదీ ఉదయం 6 గంటలకు పాండవుల కొండపై వెలసిన పార్థసారథి స్వామి ఆలయంలో నెల గంట మోగడంతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శిని ఉత్సవాలు జరుగుతాయన్నారు. 13వ తేదీన భోగి రోజు అత్యంత వైభవంగా గోదాదేవి కల్యాణం జరుగుతుందన్నారు. దీంతో ధనుర్మాస ఉత్సవాలు పూర్తవుతాయన్నారు.


పెదమదీన రామాలయంలో భజనలు

నెల గంట ప్రారంభోత్సవాలకు భక్తులు హాజరు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు కోరారు.

అర్జునగిరి నృసింహస్వామి ఆలయంలో...

చీడికాడ : మండలంలోని అర్జునగిరిలో వెలసిన అతిపురాతనమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు నెలగంట పెట్టనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు తెలిపారు. సోమవారం నుంచి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ బోడాల రమాదేవి తెలిపారు.

హడలెత్తిస్తున్న చలి పులి

రోలుగుంట : రెండు రోజులుగా చలి...పులి ప్రజలను హడలెత్తిస్తోంది. తుపాను గండం తప్పిపోగా రెండు రోజులుగా వాతావరణం బాగా చల్లబడింది. చిన్నారులు, వృద్ధులు ఈ చలికి బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రుల్లో రోగులు ఈ చలికి హడలిపోతున్నారు. కొవ్వూరు గ్రామంలో ఆదివారం 8:30 గంటల సమయంలో యవకులు సైతం మంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : కంచుగుమల గ్రామంలో శిథిలమైన సత్యనారాయణస్వామి దేవాలయానికి టీటీడీ నుంచి గత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 50 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఆదివారం గ్రామానికి వచ్చి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, నాయకులు పరవాడ నారాయణదొర పాల్గొన్నారు. కాగా గతంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కంచుగుమల మాజీ సర్పంచ్ పరవాడ చిన్ని తమ అభ్యర్థన మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేవాలయం పరిస్థితిని అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన టీటీడీ నుంచి రూ. 50 లక్షలు మంజూరు చేశారని ఈ సందర్భంగా విలేకరులకు వివరించారు.

విద్యుత్ పొదుపుతో భవిష్యత్తుకు వెలుగు


మాట్లాడుతున్న ఏడీఈ

చోడవరం రూరల్: విద్యుత్‌ను ఇష్టారీతిగా వాడకుండా, అవసరం లేనపుడు లైట్లు, ఫ్యాన్లు వంటివి స్విచాఫ్ చేయడం, ఏసీ వాడకం తగ్గించడం వంటి పొదుపు చర్యలు పాటిస్తే భవిష్య తరాలకు మదుపు చేసినట్టే అని చోడవరం సబ్ డివిజన్ ఏడీఈ కె.కుమార్ గౌరీప్రసాద్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్వయం సహాయక బృందాల లీడర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బొట్టు బొట్టు నీరు నదిలా మారి సముద్రం అయిన రీతిలో విద్యుత్ యూనిట్, యూనిట్ ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇంధన వాడకంలో ప్రత్యామ్నాయాలను, పొదుపు చేసే విధానాలను కూలంకషంగా వివరించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ వంటి పోటీల నిర్వహణ, కరపత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. చోడవరం ఎంపీడీవో ఆంజనేయులుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చోడవరం రూరల్ ఏఈ ఉదయ్‌కుమార్, సీసీ రత్నం పాల్గొన్నారు.

కొత్తపెంటలో వైద్య శిబిరానికి విశేష స్పందన


దేవానంద స్వామీజీ ఆశ్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి : కొత్తపెంటలో శ్రీసద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ 25వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని మందిరం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ సద్గురు దేవానంద దివ్య జీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మధురవాడ వేదాంత తల్లిపిల్లల ఆసుపత్రి, కె.కోటపాడు సంజీవిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ , గాజువాక పవన్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ సంయుక్త సౌజన్యంతో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ వైద్య నిపుణులు దేవణి, లోవ ప్రకాష్, డేనియల్, లాలం పవన్ వైద్య సేవలందించారు. 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ శంకరరావు, స్వామీజి ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు సహాయ సహకారాలు అందించారు.

210 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నాతవరం: మండల కేంద్రంలో గల పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కేఎస్ఆర్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో నర్సీపట్నం చెందిన వేణుగోపాల్ ఆస్పత్రికి చెందిన వైద్యులు 210 మంది రోగులను పరీక్షించారు. శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవలసిన ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ వంటాకు అప్పాజీ, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు ఈ వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 64 మందికి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇచ్చారు. వీరిలో 30 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించి వీరికి శంకర్ ఫౌండేషన్‌లో నిర్వహించేందుకు తరలించారు. కంటి వైద్య నిపుణులు అరుణ, క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, సూర్రెడ్డి బాబూరావు పాల్గొన్నారు.

5 దేవాలయాల్లో నేడు నెల గంట ప్రారంభం

మాడుగుల: స్థానిక సీతారామ స్వామి, పార్థ సారాధి, వేణుగోపాల స్వామి, జగన్నాథస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం 6.35 గంటలకు నెల గంట ప్రారంభోత్సవాలు జరుగుతాయని, సత్యసాయి సేవాసంఘం సభ్యుడు పుట్టా బలరాము తెలిపారు. ఈ ఆలయాలు పరిధిలో 17 వ తేదీ నుంచి ప్రతిరోజు నెల రోజుల పాటు, తిరువీధి ఉత్సవాలు, 18 వ తేదీ నుంచి మేలు కొలుపులు జరగనున్నాయన్నారు.

21న ధ్యాన దినోత్సవం

నర్సీపట్నం : ప్రపంచ ధ్యాన దినోత్సవ కార్యక్రమం ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు చేస్తానని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ నెల 21న హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ రామచంద్ర మిషన్, వాకర్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. నిత్యం ఒత్తిడితో జీవిస్తున్న ప్రజలకు ఈ కార్యక్రమం ఎందో దోహదపడుతుందని స్పీకర్ పేర్కొన్నారు. తప్పని సరిగా కార్యక్రమానికి విచ్చేసి తన సహాయ సహకారాలు అందిస్తానని నిర్వాహకులకు స్పీకర్ హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికకు హాజరైన పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : వారంతా చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో టెన్త్ చదువులను పూర్తి చేశారు. ఐదేళ్ల పాటు ఇదే పాఠశాలలో 6 నుండి 10 వ తరగతి వరకూ చౌడువాడ, గుల్లేపల్లి, పైడంపేట, నర్సాపురం, సీమునాపల్లి, పాచిలవానిపాలెం, మల్లంపాలేనికి చెందిన విద్యార్థులు చదువులు సాగించారు. పాఠశాల చదువులు పూర్తయిన 26 ఏళ్లకు మళ్లీ అదే పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. నాటి 35 మంది పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. నాటి మధుర స్మృతులు నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు గండ్రేటి సత్యంమూర్తి, చోడవరం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు (డీవీఆర్), చౌడువాడ ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, తనకల జగన్నాథరావు, తనుబుద్ధి నాగేశ్వరరావు, రొంగలి వెంకట రామ వసంత, రెడ్డి సర్వలక్ష్మి, రొంగలి వరలక్ష్మి, చిరికి రామలక్ష్మి, దాడి నాగరాజు, కాశీ పూర్ణదేశాయ్, దాడి శంకర్‌రావు, శరగడం రామసూరి అప్పారావు, సబ్బి దేముడు, రొంగలి అర్జునరావు, ఉరుము ఈశ్వరరావు, రాజి కృష్ణమూర్తి తదితరులు త్రిమూర్తులు హాజరయ్యారు.


ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెంలో...

మాకవరపాలెం : పూర్వ విద్యార్థుల కలయిక ఉల్లాసంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 1991–92 ఏడాదిలో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాచపల్లి జంక్షన్ సమీపంలో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 33 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. సమ్మేళనంలో సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.